కే ఎ స్వీ

# ప గు లు

"మునిపల్లెలో నీ పేర్న మూడెకరాల పొలం ఉంది-తెలుసా?" అని అడిగాడు మామ మారయ్య, శేఖరాన్ని.

క్షణం ఆలోచించి గుర్తుచేసుకున్నాడు శేఖరం. "అ(డసు-ఉండాలి" అన్నాడు.

"ఉండాలి-కాదు! ఉంది. అదిప్పుడు అమ్మకొని కొచ్చింది. అమ్మెయ్యటం నీ ఇష్టమేనేమో కనుక్కోమ్మన్నాడు మీ నాయన" అన్నాడు మారయ్య.

సంవత్సరం క్రితం పెళ్ళి చేసుకున్నాడు శేఖరం. అది తల్లీ తండ్రీ కుదిర్చిన సంబంధం కాదు. శేఖరం ఒకమ్మాయిని చూశాడు ఇష్టపడ్డాడు. విషయం తెలిసి తల్లీ తండ్రీ ఇష్టపడ్డట్టే కనిపించారు. కాని పెళ్ళి తంతు నిర్వహణకి సంబంధించి అనుకోకుండా మనస్తాపాలు తలెత్తాయి. మొత్తానికెలాగో పెళ్ళి మాత్రం జరిగిపోయింది. ఆ తరువాతా కథ తిన్నగా జరగలేదు. కొత్తకోడలు అత్తింట ఇమడలేని పరిస్థితు లేర్పడ్డాయి. తప్పని సరయి వేరింటికాపురం పెట్టాల్సి వచ్చింది శేఖరానికి. వేరుగా వచ్చేసిన రోజున ఒక డ్రామా లాంటిది జరిగింది. తరువాత శేఖరానికీ తండ్రికీ మాటలు లేకపోయాయి. ఒకరి గురించి ఒకరు వాకబు చేసుకోవటమే గాని రెండిళ్ళకూ రాకపోకలు కూడా లేవు. ఆ వాకబుదారుల్లో ఒకడు మామ మారయ్య.

శేఖరం తండ్రి భూషణరావు టౌనులో పెద్ద ప్లీడరు. బంధుత్వమైతే ఉంది గాని భూషణరావుకు మారయ్యమీద పెద్దగా అపేక్ష ఏమీలేదు. టౌనులో పెద్ద కంట్రాక్టరయిన మారయ్య, కోర్టు విషయాల్లో అనువుగా ఉంటాడని భూషణరావును ఒకంతట విడిచిపెట్టడు. ఇదుగో-ఇట్లాంటి విషయాల్లో మధ్యవర్తిత్వం నెరపుతూ భూషణరావు ప్రాపకాన్ని ఎప్పటికప్పుడు నదురుగా ఉంచుకుంటూ ఉంటాడు.

భూషణరావుకూ మారయ్యకూ మునిపల్లే స్వగ్రామం. కొత్త బ్రతుకు తెరువు వెదుక్కుని ముప్ఫయ్యేళ్ళ క్రితం మునిపల్లె వదిలి టౌనుకు వచ్చేశారు.

"ఇంతకూ ఆ పొలం-మునిపల్లెలో ఎక్కడుంది?" అని అడిగాడు శేఖరం.

సన్నగా నవ్వాడు మారయ్య. "పెద్ద చదువులు చదివినావుగాని— ఏం లాభం చెప్పు.... నీ పేరున పొలం ఉండేదెక్కడో గూడా నీకు తెలీదు—"

"ఎప్పుడో చిన్నప్పుడుపోయా మునిపల్లెకు-అంతే...."

"సరే-సరేలే, నీ పేర్న ఉన్నది ఏట్లో పొలం. అక్కడ దాన్ని ఇసికమిట్ట అంటార్లే. మీ నాయన పేర్న ఉండే పిత్రార్జితం అయిదెకరాలూ అక్కణ్ణే సుబ్బరాముడు కౌలుకు చేసుకుంటూ వుండాడు. ఆ సంగతన్నా నీకు దెలుసో లేదో. ఈ మూడెకరాలూ ఆరేళ్ళప్పుడు కొన్నాడు మీ నాయన. సీలింగూ, టాక్సూ.... అవన్నీ దృష్టిలో పెట్టుకుని ఆ కొనడం నీ పేర్న కొన్నాడు...."

"అవును—గుర్తొస్తోంది ..."

"సీతారామయ్య దగ్గిర్నుంచి కొన్నాడులే, పదారు వేలకి కొన్నాడప్పుడు. స్వంతంగా చేసుకోవాలనే కొన్నాడు. కాని, ఎక్కళ్ళే....ఆయనకు వీలుగాలా...." అంటూ సన్నటి వెక్కిరింత ధ్వనించే నవ్వునవ్వాడు.

మునిపల్లెలో మారయ్యకు ఇంకా కూడా వ్యవసాయం ఉంది. ఇక్కడ కాంట్రాక్టులతో సతమతమవుతూ కూడా అక్కడ సేద్యం ఎలాగోచేయిస్తూ ఉంటాడు. ఈవిషయంలో భూషణరావు తనతో పోటీ అభిప్రాయాలు పెట్టుకున్నట్టు మారయ్య అనుమానం. అనుమానమేమిటి, నమ్మకం కూడా. పొలం కొన్నప్పటికీ భూషణరావు స్వయాన దాన్ని చేసుకోనూ చేసుకోకా, కౌలుకూ ఇవ్వకా—అలాగే ఉంచెయ్యటం మారయ్యకు కించిత్తు గర్వకారణం.

"అవును-కొనటం నాకు గుర్తుంది—" అన్నాడు శేఖరం. ఈ భూమీ పుట్రా విషయం అతని కెప్పుడూ పట్టలేదు. తనేమిటో తన చదువేమిటో అన్న ధ్యాసలో—లౌకిక విషయాలకు చాలా వాటికి అతీతంగా ఉండిపోయాడు.

"నీ పెళ్ళికి ముందు—అంటే ఇప్పటికి రెండేళ్ళ ముందు—ఈ మూడెకరాలకూ బేరం వొచ్చింది. ముప్ఫయి వేలకు—"

"అవును - గుర్తొస్తోంది" అన్నాడు శేఖరం. తండ్రికీ తనకూ మధ్య ఈ విషయమై మాటలు నడిచినట్టు లీలగా జ్ఞాపకం వచ్చింది.

"సుబ్బయ్యగారి మల్లయ్య భూమినికొంటానన్నాడు- ముప్ఫయి వేలకు. అమ్మేద్దామనుకున్నాడు మీ నాయనకూడా. అంతలోకే మనసు మార్చుకున్నాడు. ఎందుకంటే - భూమికింకా రేటు పెరిగేట్టు కనిపించింది. మల్లయ్య పెదనాయన కొడుకే- సాంబయ్య.... భూమి కొంటానని పోటీపడి వొచ్చినాడు. భూమి కొంటేగింటే మల్లయ్యకే ఎక్కువ అనుకూలం. ఎందుకంటే- ఈ మూడెకరాల్ని ఆనుకునే వాడిపొలం ఆరెకరాలూ వుంది. అయితే— పల్లెటూళ్ళో పరపతుల్సంగతి వేరే చెప్పాల్నా ? అన్నిట్లోగూడా మల్లయ్యకు పోటీపడొస్తాడు సాంబయ్య. ఈ మూడెకరాలకూ ముప్పైమూడు వేలిస్తానని అప్పట్లోనే ఎగబడొచ్చినాడు. రేటింకా పెరుగుతుంది లెమ్మని మీ నాయన అప్పట్లో భూమి రేటు ముప్పైఎనిమిది వేలని చెప్పి, ఇద్దర్లో ఎవరూ ఎక్కిరాకుండే సరికి; అమ్మకం ప్రసక్తి తాత్కాలికంగా ఆపుజేసినాడు...."

"ఇప్పుడు బేరం ఎంత పలుకుతోంది ?"

"నలభై వేలు. తొలి బేరం పెట్టినప్పట్నుంచీ గూడా మల్లయ్యకీ మూడెకరాల మీదా మనసు పీకుతానే వుంది. వాడి పొలంలో బావి వుందిగాని ఎండాకాలంలో పీల్చుకుని పోతుంది మన భూమిలో అయితే బోరింగు తప్పకుండా పడుతుందన్నారంట. ఆరూ మూడూ తొమ్మిదెకరాలూ తనవే అయితే బోరింగేసుకుని సేద్యం హాయిగా చేసుకోవచ్చని వాడి తాపత్రయం. పోటీ పడినోడు ముప్పయ్యేనిమిద్దాకా కూడా సిద్ధపడినాడు సాంబయ్యేమో. తెగాయించి మల్లయ్య ఏలభై కీ రెడీఅన్నాడు. సాంబయ్య అంతట్తో వూరుకున్నాడు. బైటివాడెవడూ కొనడు. ఆ వూళ్లో ఈ మూడెకరాలకు అంతకు మించి ధరపలకదు. సరేనన్నాడు మీ నాయన. నీతో చెప్పిగాని వ్యవహారం సెటిలుగాదు గాబట్టి, నీ అభిప్రాయం తెలుసు కొమ్మని నన్ను పంపించినాడు........ నమంటావు?" అన్నాడు మారయ్య.

ఇంటి నుంచి వచ్చేసేప్పుడు కట్టుబట్టలతో వచ్చాడు శేఖరం. పెళ్ళి విషయమై సాగిన రకరకాల వాదోపవాదాల్లోనూ, స్వంత ఇష్టాన పెళ్ళి చేసుకున్న కారణంగా ఆ ఇంట కలిగిన చేదు అనుభవాల్లోనూ అతని అభిమానం బాగా దెబ్బతిన్నది. తండ్రి సంపాదన నుంచి ఆ తరువాత అతను కానీ అయినా ఆశించదలచలేదు.

"ఏముందీ ?- ఇందులో నేను అనటానికేముందీ?" అన్నాడు శేఖరం. "ఆయనకు ఎట్లా సమ్మతమయితే అట్లా చెయ్యమను" అంటూండగా అతని గొంతు కాస్త వణికింది.

"భూమి నీ పేర్న వుంది గదా...."

"ఎవరి పేర్న ఉంటేనేం ? కొన్నది ఆయన. అమ్ముతున్నదీ ఆయన. కొన్నంతకన్న రెండింతలూ.... ఇంకా ఎక్కువె వస్తుందంటున్నావు గదా.... ఇంకా ఏమైనా పెరిగే సూచన ఉందా ?...."

"ఊహు!.... కొంటే ఇంక మల్లయ్యే కొనాలగదా నలభైకి మించి ఇంక పెరిగే మాటలేనట్టే "

"అయితే-ఇంకేం- అమ్మెయ్యొచ్చు. అమ్మెయ్యమనే నాన్నకు చెప్పు."

"సరే !" అన్నాడు మారయ్య కాస్త తేలికగా ఊపిరి పీల్చుకుంటూ మరి పత్రాల్లో నువ్వు చేవ్రాలు చెయ్యాల్సుంటుంది—"

"సరే !...."

"మునిపల్లె.... వీరకోట తాలుకాకు చెందింది. రిజిస్ట్రేషను వీరకోటలో గదా జరుగుతుంది.... నువ్వక్కడికి రావాల్సుంటుంది...."

క్షణం ఆలోచించాడు శేఖరం. "ఎప్పుడుంటుంది రిజిస్ట్రేషను ?...."

"అదిప్పుడే ఎట్లా తేలుతుంది" నువ్వు సరేనన్నావు గదా. నేను విషయం మీ నాయనకు చెప్తాను. ఆయన మల్లయ్యను పిలిపించి చెప్పాల. వాళ్ళు డబ్బివ్వాల. ఆ తర్వాత రిజిస్ట్రేషను. దీనికంతా ఇంకా నాలుగైదు రోజులు పడుతుంది. వచ్చే గురువారమో శుక్రవారమో కావచ్చు. నీకు వీలువుతుందా ?"

"వచ్చేవారం వూళ్ళో వుంటాను గనుక ఇబ్బందేమీ లేదు. కాని ముందు రోజు సాయంత్రం కబురు పెడితే, ప్రయాణానికి తయారుగా ఉంటాను...."

"సరే అయితే .... రిజిస్ట్రేషను చేసివ్వటం మన సౌకర్యం గదా.... నీకు వీలుండేటప్పుడే అది జరుగుతుంది" అంటూ లేచాడు మారయ్య.

"ఎలాగో వీలు చేసుకుంటాను. కాని ఇటువంటి వ్యవహారాలు సాధ్యమైనంత తొందరగా తెగిపోతే మంచిదనుకుంటాను. నాకు రిజిస్ట్రేషనూ పత్రాలూ ఆ గొడవలన్నీ బొత్తిగా తెలీవు. అంతా మా నాన్నను చూసుకొమ్మను. పత్రాలు ఇక్కడే రాస్తారా?...."

"ఏమో- అవన్నీ తర్వాత మాట్లాడుకోవాల. ముందు నువ్వు అడ్డం చెప్పకుండా వొప్పుకున్న సంగతి మీ నాయనతో చెప్తాను. రిజిస్ట్రేషను తతంగం ఆ తర్వాత గదా .... మరి నే వెళ్లొస్తాను " అని కదిలాడు నారయ్య.

"రిజిస్ట్రేషను విషయం నాకు ముందురోజు సాయంత్రం కబురు పెడితే బాగుంటుంది" అని అయన్ను సాగనంపాడు శేఖరం.

ఆ తర్వాత అతను ఆలోచనలో పడ్డాడు.

తండ్రికీతనకూ మధ్య తనపెళ్ళికారణంగావైషమ్యాలు తలెత్తకుండా ఉంటే ఎంతబాగుండేదా అనుకుంటూ ఉండ చాలా సేపటి తరువాత నిట్టూర్చాడు.

* * *

స్వంతంగా పెట్టుకున్న బిజినెస్ పనులమీద అప్పుడప్పుడూ పై ఊళ్ళకి వెళ్ళవలసి వస్తుంది శేఖరానికి.

మరుసటి వారం ఊరొదిలే పనేమీ ఉండదనే అనుకున్నాడుగాని, అనుకోకుండా వెళ్లాల్సిన అవసరం కలిగింది.

రిజిస్ట్రేషను గురువారమో శుక్రవారమో అని మామ అన్నాడు గదాని తన ట్రిప్పును శనివారానికి వాయిదా వేసుకున్నాడు శేఖరం.

కాని మారయ్య నుంచి శుక్రవారం దాకా ఏ కబురూ రాలేదు.

తీరా శనివారం నాడు తన ప్రయాణానికి రిజిస్ట్రేషను గొడవ అడ్డు పడుతుందేమో ననుకుని, విషయం కనుక్కురావటానికని మారయ్య మామ ఇంటికి బయలుదేరబోయాడు శేఖరం.

ఆలోగా మారయ్య పంపించారంటూ మనిషి రానే వచ్చాడు. మునిపల్లె పొలం అమ్మకం ఖరారయిపోయిందట. నలభై వేలూ మల్లయ్య భూషణరావుకు అంతకు ముందు రోజు రాత్రే జమచేశారట. రేపటి దినం— అనగా శనివారం నాడు రిజిస్ట్రేషనుకు అన్ని ఏర్పాట్లూ చేసుకుంటున్నారట. రేపు ఉదయం ఎనిమిదిన్నరకల్లా శేఖరాన్ని మారయ్య ఇంటికి రమ్మని వర్తమానం.

"అలాగే వస్తా"నని కబురు తెచ్చిన మనిషిని పంపేశాడు శేఖరం.

తన- పై ఊరు ప్రయాణాన్ని సోమవారానికి వాయిదా వేసుకున్నాడు.

ఆ రాత్రి ఎనిమిది గంటలప్పుడు శేఖరానికి అనుకోకుండా ఒక చిన్న అనుమానం వచ్చింది.

ఆ కోర్టు వ్యవహారాలూ, అమ్మకాలు లావాదేవీలూ తనకు బొత్తిగా తెలీవు. నలభైవేల అమ్మకం అంటే పెద్ద విషయం. బంధువైనా, తండ్రికి ఏదో లాగా కావలసినవాడే అయినా, మారయ్యను ఎంతవరకూ నమ్మటం? ఇందులో లాలూచీలో పేచీలో ఉన్నాయో ఏమో తనకేం తెలుసు?

తండ్రికీ తనకూ మధ్య మాటలు లేకపోవటాన్ని వీలుగా చేసుకుని మారయ్య ఆ మల్లయ్యతోనో మరికొందరితోనో కలిసి దొంగాటకం ఆడుతూ ఉంటే- తనకెలా తెలుస్తుంది?

సొమ్ము తండ్రికి అందింది లెమ్మనమని తను గుడ్డిగా వెళ్ళి పత్రాల్లో సంతకాలు పెట్టి ఇచ్చేస్తే ఆ పైన- ఎంత నగుబాటూ, ఎంత నష్టం?

బాగా ఆలోచించి, చిన్నపాటి ముందుజాగ్రత్తగా ఆ రాత్రే తండ్రిదగ్గరికి మనిషిని పంపాడు శేఖరం. సొమ్ము నలభై వేలూ అందిందా, తను వెళ్ళి రిజిస్ట్రేషను చేయించవచ్చా- కనుక్కురమ్మన్నాడు.

వెళ్ళినమనిషి అరగంటకల్లా తిరిగొచ్చాడు. అనుకున్న డబ్బు పూర్తిగా అందిందట. శేఖరాన్ని వీరకోట వెళ్ళి రిజిస్ట్రేషను చేయించిరమ్మని తండ్రి చెప్పాడు.

తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు శేఖరం. చాలాకాలం తర్వాత తనవేపునుంచి తండ్రితో ఈ రకమైన రాయబారం నడటం కూడా అతనికి కాస్త సంతోషాన్ని కలిగించింది.

* * *

శనివారం ఉదయం ఎనిమిదిన్నరల్లా మారయ్య మామ ఇంటికి చేరుకున్నాడు శేఖరం. మధ్యాహ్నానికల్లా తిరిగొచ్చేస్తానని భార్యతో చెప్పి బయలుదేరాడు.

శేఖరం వెళ్ళేసరికి మారయ్య చాలా "బిజీ"గా ఉన్నాడు. ఇంటి ముందు ఇటుకల లారీలు ఆగిఉన్నాయి. కంట్రాక్టు పనులకు సంబంధించిన మనుషులు మారయ్యను కనిపెట్టుకుని హడావుడి పడుతున్నారు.

వరండాలో బెంచీమీద కూచున్న నల్లటి లావుపాటి నడివయసు మనిషి శేఖరాన్ని చూస్తూనే వినయంగా లేచి నిలబడి 'నమస్తే అన్నా !" అన్నాడు.

నమస్కారం అందుకుని శేఖరం లోలోపల కాస్త ఆశ్చర్యపోయాడు.

అడ్డపంచెమీద నీలంరంగు చొక్కా తొడుక్కున్న ఆ మనిషి మల్లయ్య కావచ్చునని ఊహించాడు. వయసున తను అతనికన్న చిన్నవాడు. అయినా చదువుకున్నవాడనీ, భూమి అమ్మబోతున్న వాడనీ, భూషణరావు కొడుకనీ — తనకు మర్యాద లభిస్తున్నట్టు సులువుగా నే గ్రహించాడు.

ఫోనుమీద ఎవరితోనో మాట్లాడుతున్న మారయ్య శేఖరాన్ని చేతి సైగతో కూచొమ్మని చెప్పి, ఫోను సంభాషణ ముగిశాక ఇందాకట నీలిచొక్కా మనిషిని ఉద్దేశించి "మల్లయ్యా!....." అని పిలిచాడు.

"అయ్య !" అంటూ వచ్చాడు మల్లయ్య, చేతులు నలుపుకుంటూ.

"ఇదుగో- మావాడొచ్చేశినాడు .... ఇంక పోదామా అయితే...."

"అయ్య.... బయలుదేర్దామండి...."

నాధయ్య పక్కనే మరొక ఏభయ్యేళ్ళ పెద్దమనిషి కూడా ఉన్నాడు. అతని బట్టలూ, వాలకమూ- అతనూ పల్లెటూరి నుంచే, వచ్చాడని చెప్పక చెబుతున్నాయి.

"ఏం చెబుమయ్యా ?...." అన్నాడు మారయ్య. ఆయనకేసి చూడకుండా.

"బయల్దేరదాం.... తొందరగా పోతే తొందరగా తెవుల్తుంది...." అన్నాడు చలమయ్య.

"మరి పత్రాలూ అవీ- రాయటం అయిందా ?" అని అడిగాడు శేఖరం.

"అవి వీరకోటలో రాసుకోవాల్సిందే...." అన్నాడు మారయ్య.

"నా పేర్న భూమి ఉన్న పత్రాలేవీ ? షెడ్యూలూ- సర్వే నంబర్లూ అందులో ఉంటాయి గదా.... అన్నాడు శేఖరం. తండ్రి ప్లీడరు కావటాన పత్రాల గురించి అతనికి ఆ మాత్రమైనా తెలిసింది.

"ఆ పత్రాలు.... మీ నాయన దగ్గిరే వుంటయ్యేమో" అన్నాడు మారయ్య.

"అవును- నాకేం ఇయ్యలేదు" అంటూ నసిగాడు మల్లయ్య.

"డబ్బు జమజేసిన వాడివి మొన్న రాత్రే ఆ పత్రాలెందుకు తీసుకోలేదూ ?...." చిరాగ్గా అడిగాడు మారయ్య.

"జమచేసేప్పుడు కరణం గూడా వున్నాడు గదా.... సర్వేనంబర్లూ షెడ్యూలూ ఆయనకు దెలుసు.... అందుకని పత్రాలు దీసుకోలేదేమో.... రిజిస్ట్రేషనుకు కరణం గూడా వస్తానన్నాడు గదా........" అంటూ నీళ్ళు నమిలాడు మల్లయ్య.

"నువ్వడగలేదెందుకయ్యా అప్పుడు? అడిగితే వకీలు ఇచ్చేసి వుండును గదా.... నాకు గూడా అప్పుడు తోచనే లేదు-" అన్నాడు చలమయ్య.

"కరణమొచ్చినాడు- రాకపోయినాడు. డబ్బు జమ జేసిన వాడివి పాతపత్రాలు తీసుకోవాల్నా వొద్దా?" అంటూ

ఫోనెత్తి నంబర్ డయల్ చేశాడు మారయ్య. అవతలిమనిషి గొంతు వలుకగానే మారయ్య శేఖరం వేపు సాభిప్రాయంగా చూశాడు.

లైనులో ఉన్నది తన తండ్రి అని గ్రహించాడు శేఖరం.

ఫోనులో క్లుప్తంగానే మాట్లాడాడు మారయ్య. మధ్యలో "ఆఁ—"ఇప్పుడే వొచ్చినాడు—ఇక్కడ్నే వున్నాడు" అన్నాడు శేఖరం వేపు చూసి.

ఆ తరువాత పత్రాల విషయం అడిగాడు. "పంపిస్తాను. ఇప్పుడే వొస్తాడు" అని చెప్పి ఫోను పెట్టేశాడు.

"మల్లయ్యా.... నువ్వు తొందరగా పోయి పత్రాలు తీసుకురామరి...."అన్నాడు సూరయ్య.

"అయ్యా .... అట్లాగేనండి..." అంటూ కదిలాడు మల్లయ్య.

నలభై వేలు పోసి పొలం కొంటున్నవాడు భూమి తాలూకుపత్రాలవిషయంలో అంతఅజాగ్రత్తగానూ అమాయకంగానూ వుండిపోవటం వింత అనిపించింది శేఖరానికి.

"పత్రాలు తీసుకుని మల్లయ్య నేరుగా బస్‌స్టాండుకే వొస్తాడు. మనం ఈ లోగా బస్‌స్టాండుకు బయల్దేరితే పోలా?" అన్నాడు చలమయ్య.

"అవును- బయల్దేరదాం" అంటూ లేచి సన్నద్ధుడై "అవునూ.... ఇంతకూ ఏకాంబరం సంగతేమిటి ?" అని ఆగాడు మారయ్య.

ఏకాంబరం గురించి శేఖరానికి అదివరకే తెలుసు. ఏకాంబరం మునిపల్లె గ్రామస్థుడు. బంధుత్వం అంటూ ఏమి లేకున్నా మారయ్య చాలా దగ్గిర దోస్తుగా సహచరుడుగా చాలా కాలం నుంచీ ఉంటున్నాడు. మునిపల్లెలో వ్యవసాయం విషయంలో మారయ్యకు అతను వత్తాసు వస్తుంటాడు.

"కరణమూ ఏకాంబరమూ....ఇద్దరూ కలిసే బైల్దేర్నారండి మునిపల్లె నుంచి...."అన్నాడు మల్లయ్య. ఈ కాడికి వీరకోట చేరేసే వుంటారు" అన్నాడు.

"బయల్దేర్నారా ? బయల్దేరతామన్నారా ?" అని అడిగాడు మారయ్య.

"బయల్దేర్నారండి" బస్‌స్టాండు దగ్గిర్నే చూశినాను వాళ్ళిద్దర్నీ—".

"సరే అయితే" అన్నాడు మారయ్య సమాధాన పడుతూ. "అయితే నువ్వు పోయి పత్రాల్తో బస్టాండుకు వొచ్చెయ్యి- మేం‌వూఁ బైల్దేరతాం" అని మల్లయ్య వెళ్ళిన కాస్సేపటికి మరో రెండుమూడు ఫోను కాల్సు చేసి తను లేనప్పుడు జరగాల్సిన పనుల గురించి పనివాళ్ళను పురమాయించి శేఖరాన్నీ చలమయ్యనూ బయులుదేరదీశాడు మారయ్య.

ముగ్గురూ బస్‌స్టాండు చేరుకునేసరికి మల్లయ్య పత్రాలతో సహా కలుసుకున్నాడు.

మరుసటి రోజే కొండమీద బ్రహ్మోత్సవాలు కావటం చేత బస్సుల్లో రద్దీ బాగా ఉంది. మరీ వీరకోట రూట్లో వెళ్ళే బస్సులు కిటకిటలాడిపోతున్నాయి.

గంటపైగా వెయిట్ చేశాకగాని బస్సు ఎక్కలేకపోయారు నలుగురూ. అది వీరకోటకు నాన్‌స్టాపు బస్సే. అప్పటికే అందులో జనం స్టాండింగ్‌లో కూడా ఉన్నారు.

కూచున్న పాసింజర్లని ఇద్దర్ని బ్రతిమిలాడి మారయ్యకూ, శేఖరానికీ కాస్తచోటు చూపించి కూచోబెట్టాడు మల్లయ్య.

"మీరు కూచోండి...."అన్నాడు శేఖరం మల్లయ్యతో.

"ఆఁ నువ్వు కూచోవాల"అన్నాడు మారయ్య! అదేదో పెద్ద సంప్రదాయాన్ని కాపాడుతున్నట్టు.

"చలమయ్య- పెద్దాయన.... ఆయన్నిక్కడ కూచోమనండి- నేను నిలుచుంటాను-" అన్నాడు శేఖరం.

"ఆహఁ.... అదెట్ల ? నువ్వు కూచోవాల బాబు" అన్నాడు చలమయ్య.

ఇట్లాంటి వ్యవహారాల్లో అమ్మేవాడు మగపెళ్ళి వారి

లాగానూ, కొనేవాడు ఆడపెళ్ళి వారిలాగానూ ప్రవర్తించటం తొలిసారిగా గమనించాడు శేఖరం.

వీరకోట చేరేదాకా అతను సీటులో ఇబ్బందిగానే కూచుని ఉన్నాడు.

వీరకోట చేరేసరికి మిట్టమధ్యాహ్నమయింది.

"మనం భోజనాలు చేసుకుని రిజిస్ట్రారు ఆఫీసుకు పోదామా యెట్ల ?" అని అడిగాడు చలమయ్య.

"అయ్య.... యెట్లంటే అట్లే ...." అని సమాధానం వచ్చింది మల్లయ్య నుంచి.

"ఇప్పట్నించీ తినేదెందుకూ ? ముందు ఆఫీసు కాడికే బోదాం. కరణమూ ఏకాంబరమూ అణ్ణే వుండాలగదా !...." అన్నాడు మారయ్య.

ఏ వ్యవహారమైనా సెటిలు చేసేటప్పుడు పక్కన ఏకాంబరం. లేకుంటే మారయ్యకు తోచదు. అతగాణ్ణి చూసి చాలా కాలమే అయినట్టుంది, ఎప్పుడెప్పుడు చూద్దునా అనే తాపం మారయ్య మాటల్లో ధ్వనిస్తోంది.

"అయితే పదండి మళ్ళీ—"అని చలమయ్య ముందు కడుగెయ్యబోతే- "ఆఁ—ఎండగద ఎట్ల నడుస్తాం" అని అటూ ఇటూచూసి "ఒరే రిక్షా !" అని కేకేశాడు మారయ్య.

మారయ్య శేఖరమూ ఒక రిక్షాలోనూ మల్లయ్యతో చలమయ్య మరోదాన్లోనూ బయలుదేరారు.

దార్లో మారయ్య శేఖరానికి మల్లయ్య కుటుంబీకుల గురించిన కొన్ని సత్యాలు ఎరుకపరుస్తూ వచ్చాడు. "పిసినారి నాయాళ్ళు ! ఎంగిలి చేత్తో కాకిని విదిలించరనుకో....ఇట్ల సమయం వచ్చినప్పుడు మన్లాంటోళ్ళ మున్నా కొంచెం వీళ్ళ పొట్ట కరిగించాల."

"అన్యాయం" అందామనుకున్నాడు శేఖరం. కాని, అని లాభం ఉండదనుకుని ఊరుకున్నాడు.

"నీకి వ్యవహారాల గొడవలు దెలీవనుకుంటా .... నువ్వట్ల చూస్తావుండు .... తమాషా అంతా చూపిస్తాను— ఏం మొగమాట పడక— నీగ్గావలిసిందంతా జరిపిస్తాను" అన్నాడు మారయ్య. ఆ మాట పూర్తిగా అర్థంగాకున్నా, ఎందుకో లోపల కొంచెం లజ్జ అనిపించింది శేఖరానికి. బహుశః మారయ్యను తన మామగా భరించవలసినందుకు—

రిజిస్ట్రారు ఆఫీసు దగ్గర రిక్షాలు దిగారు. బాధ్యత నిర్వహిస్తూ రిక్షా ఛార్జీలు చెల్లించాడు మల్లయ్య.

ఆఫీసు గేటు దగ్గరా, ఆవరణలోనూ, చెట్లకిందా 'వ్యవహారాల మనుషులు' తచ్చాడుతున్నారు.

కాస్సేపు అటూ ఇటూ కలియజూసి "ఏరా ఏకాంబరమూ కరణమూ కనిపించరే !" అన్నాడు మారయ్య.

గేటు పక్కగా తాటాకు కొట్టంకింద వొక కాకాహోటల్ నడుస్తోంది. మల్లయ్య అందులోకి వెళ్ళి, కొంతసేపట్లో ఒక పాతిక దాటిన మనిషితో తిరిగొచ్చాడు. "ఇదో కరణం కొడుకొచ్చినాడు" అన్నాడు.

అడ్డపంచెమీద పచ్చగళ్ళ చొక్కా తొడుక్కున్న కరణం కొడుకు మారయ్యకు నమస్కారం చేశాడు. చలమయ్య కేసీ శేఖరం కేసీ చూస్తూ పలుకరింపుగా నవ్వాడు.

"కరణం రాలేదా ?" అని అడిగాడు మారయ్య.

"నాయన.... రాలేదు. మీకిమ్మని యీ జాబిచ్చినాడండి...." అని జేబులోంచి చిన్న కాగితం మడత తీసి అందించాడు కరణం కొడుకు.

జాబు చదువుకుని నిమిషంసేపు మౌనంగా ఉండిపోయాడు మారయ్య. తరువాత దాన్ని మడిచి జేబులో పెట్టేసుకున్నాడు. "కరణం సంగతి సరే వొళ్ళు బాగలేదని రాశినాడు— మరి.. ఏకాంబరం ఏమయినట్టు ?" అని అడిగాడు.

"ఏమో- నాకు తెలవదండి-" అన్నాడు కరణం కొడుకు.

"ఏమయ్యా ! ఏకాంబరం బైల్దేరాడన్నావు... కూడా కరణంకూడావస్తావుండాడన్నావు ఎక్కడ ఏకాంబరం? ఎందుకు అబద్ధం చెప్పినావు ?'' అన్నాడు మారయ్య మల్లయ్యతో గద్దింపుగా.

"అయ్యా ఇద్దర్నీ బస్టాండు దగ్గిర్నే చూశినానండి"

"ఏం కూత అది ?" అని వొక్కసారిగా మండిపడ్డాడు మారయ్య. గతుక్కుమన్నాడు మల్లయ్య.

"ఎందుకట్ల అబద్ధాలు చెప్పాల ? ఏకాంబరం వొస్తా వుండాడన్నావు- నన్ను బైల్దేరదీసినావు. ఇదేం పెద్దమనుషుల్తో వ్యవహారమనుకున్నావా ? పిల్లాటలనుకున్నావా ? ఇది నాకు అవమానం కాదా ? ఫలానా పెద్దమనిషొస్తాడని చెప్పి నన్ను పిలిచిం తర్వాత- ఆ మనిషి రాకుంటే నేనెట్ల వూర్కుంటాననుకున్నావు ? చెప్పిన మనుషుల్ని రప్పించే పూచీ నీదా నాదా ? ఛో ! ఏకాంబరం ఎక్కడున్నాడో పిల్చుకు రా ! ఏకాంబరం రాకుంటే రిజిస్ట్రేషను జరగదు ! ఛో !" వణికిపోతూ ఆవేశంగా అరిచాడు మారయ్య.

మారయ్య తత్తర పడిపోయాడు. "అయ్యా అబద్ధం నేనెందుకు చెప్తానండి? అల్లిద్దర్నీ బస్సుస్టాండు దగ్గెర్నె చూశినానండి.

"చూస్తే ? ఏరీ ? కరణం జాబు పంపించినాడు- సరే .. ఏకాంబరం ఏమయినట్టు ? వీరకోటకని నువ్వనుకున్నావేమో! ఏకాంబరం ఇంకే వూరికి పోయినాడో ఏమో ! ఎందుకు చెప్తావు కల్లబొల్లి మాటలు ! ఆఁ !" అంటూ గద్దించి, కరణం కొడుకువేపు తిరిగి "ఏమబ్బా — మీ నాయనెక్కడికి పోయినాడు ?"

"తెల్లార్తే బైల్దేరి రామాపురం ఆసుపత్రికి పోయినాడు. నా చేతికి జాబిచ్చి వీరకోటకు తొందరగా పొమ్మన్నాడు. మిమ్మల్ని యిక్కడ కలుసుకొమ్మన్నాడు. వివరమంతా జాబులో రాసినానన్నాడు. ఏకాంబరం సంగతి నాకు దెలీదు .... దార్లో నాయనా ఆయనా కలిసినారో ఏమో!.... అన్నాడు కరణం కొడుకు.

"రిజిష్ట్రేషన్ సంగతి నిన్న రాత్రే కరణంతో జెప్పినాను. ఏకాంబరంతో గూడా జెప్పినాను .... ఇద్దురూ వొస్తామన్నారు. నేను మీ దగ్గిరికి బస్సెక్కుతావుంటే కరణమూ ఏకాంబరమూ బస్టాండుకి వొస్తా కనిపించినారు. వీరకోటకే బయల్దేరతా వుంటారని నేననుకుంటిని" బెదురుతూ సమాధానం చెప్పాడు మల్లయ్య.

"నువ్వనుకునేదాంతో ఎవుడిగ్గావాల? నువ్వబద్ధం జెప్పినావు- నన్ను అవమానం జేసినావు—రిజిస్ట్రేషను జరగదు- అంతే !" అన్నాడు మారయ్య.

"శేఖరానికి ఇదంతా అనవసరపు సీనుగా అనిపించింది. ఏకాంబరం రాకుంటే- ఇంత ప్రయాసపడి ఏర్పాటుచేసుకున్న రిజిస్ట్రేషను ఎందుకు ఆగిపోవాలో అతనికి అర్థం కాలేదు. కల్పించుకుని తనేమైనా చెప్పబోయినా మామ వినిపించుకునేట్టు లేడని శేఖరం ఊరుకుండి పోయాడు.

ఈ లోగా చలమయ్య కలగజేసుకుని గొంతు సర్దేశాడు. "ముందు వొచ్చిన పని సంగతి చూడాలగదా. ఏకాంబరం రాలేదు. ఎందుకు రాలేదో ఆయన్నే తరువాత కనుక్కోని. మల్లయ్య తప్పుంటే ఎప్పుడైనా నిలదీసేదేగదా. మల్లయ్య నిన్ను గాదని పోయేదెక్కడికి ?"

"ఇంతకూ ఇందులో నా తప్పు ఏముంది మామా ?" అని నసిగాడు మల్లయ్య.

"నువ్వూరుకోబ్బా !" అని కసిరాడు చలమయ్య. మారయ్యను మళ్ళీ అనునయిస్తూ "పోన్లే — నిన్ను అవమానం చెయ్యాలని మల్లయ్యమాత్రం ఎందుకనుకుంటాడు? ఇంత జేసినవాడు ఏకాంబరం ఖర్చుకి వెనకాడి ఏమన్నా ఆయన్ని పిలవకుండా వుంటాడా ? ఎట్లనో ఎక్కణ్ణో పొరబాటు జరిగిపోయింది.. నువ్వు పెద్ద మనసు జెయ్యాల—" అన్నాడు.

చలమయ్య మాటల్తో కాస్సేపటికి ఎలాగో శాంతించాడు మారయ్య. మళ్ళీ మునుపటి వ్యవహర్తనం కనబరుస్తూ "ఆఁ— సరే— ఇప్పుడు టైమెంతయింది ?" అని అడిగి, ఒంటిగంటవుతోందని తెలుసుకుని- "ఇప్పుడు రాతక్కూచుంటే వేళదాటి పోతుంది గదా— ముందు పోయి భోజనాలు చేసి వొద్దాం అయితే—" అన్నాడు.

ఏ హోటలుకు వెళ్లాలని చర్చబయల్దేరింది. మారయ్య సూచన మేరకి మిల్ట్రీ హోటలుకే రిక్షాలు బయలుదేరాయి. ఆ హోటలు కూడా బస్టాండు దగ్గరే ఉంది. బస్సు దిగిన వెంటనే భోజనాలు కానిచ్చి ఉంటే ఈ రిక్షా ఛార్జీలూ తిప్పటం తప్పి ఉండునుగదా-అని లోపలే అనుకున్నాడు శేఖరం.

రిక్షా వెళ్తుండగా జేబులోంచి కరణం రాసిన జాబు తీసి మరొక మారు చదువుకుని,దాన్ని శేఖరానికి చూపించి- చదువుతూ చెప్పాడు మారయ్య.

"ఇదుగో- చూడు — ఇదీ కరణం రాసింది— మల్లయ్య దగ్గర్నుంచి వెయ్యి రూపాయిలకు తక్కువ లేకుండా సొమ్ము తీసి మాకుమారుని చేత పంపించేది— ఇంద్కు మల్లయ్య సమ్మతించని పక్షంలో స్టాంపు పేపర్లు నలభై వేలకూ సరిపడేంత తీయించి రిజిస్ట్రేషను చేయించేది— ఆరోగ్యం బాగలేక నేను రాలేకపోతున్నాను — వీలయితే రిజిస్ట్రేషను తర్వాత భూషణరావు దగ్గర కూడా ఎంతో కొంత మొత్తం తీసి పంపచేది— చూసినావా ? అదీ సంగతి — మళ్ళా పైకి అక్కర్లు మళ్లా ఆఫీసు దగ్గిర్నే ఈ సంగతి మల్లయ్యకు చెబ్దాంలే—"

అంతా అయోమయంగా అయిపోయింది శేఖరానికి. "రిజిస్ట్రేషనుకూ కరణానికీ సంబంధం ఏముంది? మల్లయ్య అతనికి పెయ్యి రూపాయలెందుకీవ్వాలి? ఇవ్వకుంటే నలభై వేలకీ స్టాంపు పేపర్లంటే ....ఏమిటి ?" అన్నాడు - ఏమీ అర్థం కాకుండా.

'నీకేమీ తెలీదులే' అంటున్నట్టుగా నవ్వాడుమారయ్య. "వెయ్యిరూపాయిలు కరణం మామూలు" అట్లిస్తారు మామూలుగా అమ్మేవాడిదగ్గిరా కొనేవాడి దగ్గిరాతీసుకుంటాడుకరణం- మీ నాయనంటే కొంచెం ఇదుందిలే—అందుకని.. చూడు- ఏం రాశినాడో.... భూషణరావు దగ్గర కూడా ఎంతో కొంత మొత్తం వీలయితే - రిజిస్ట్రేషను తర్వాత !.... నాయనేమీ ఇవ్వడులే. ముందుగా చెప్తే మల్లయ్య ఎట్లా అడ్డం తిరుగుతాడో.... ముందు ఈ మిలిట్రీ భోజనాలు కానిచ్చి- తర్వాతే బైట పెడదాం.... "

మామ కేవలం వ్యవహారజ్ఞుడేకాక, చాలా మోసగాడు కూడానా- అని సందేహంలో పడ్డాడు శేఖరం. ఏదో పెద్ద మోసం ఇప్పుడిప్పుడే జరగబోతున్నట్టూ- అందులో తను కూడా పాల్గొనబోతునట్టూ అతనికి అనుమానం వెయ్యనారంభించింది.

"అసలు- ఎవరుగాని - కరణానికి ఎందుకియ్యాలి ?" అన్నాడు అమాయకంగా.

"అది మామూలు అంటిని గదా ! మామూలు అనే మాట అట్ల వుణ్ణీ.... ఈ పొలం మొదట మీ నాయనకు ఇప్పించినవాడు కరణమే.... తర్వాత్తరవాత మల్లయ్యకూ సాంబయ్యకూ పోటీ పెట్టించిభూమి రేటు నలభైకి పెంచిందీ కరణమే ! లేకుంటే పదహారుకు కొనింది నంభైకి ఎట్ల పెరిగింది ? కరణం వల్లే పెరిగింది.... ఆ పైనా మధ్యవర్తిగా వుండి మీ నాయనచేత మల్లయ్యకే భూమి ఇప్పించింది కూడా కరణమే.... అందువల్ల.... ఆ వెయ్యి రూపాయిలు- మామూలు.... అంతె !

"మిలిట్రీ హోటలు కిటకిటలాడిపోతోంది. అక్కడ సీట్లు సంపాయించటానికీ మల్లయ్య చెడ అవస్థ పడ్డాడు. ఖాళీ అయిన సీట్లలో ముందుగా శేఖరాన్నీ మారయ్యనూ కూచోబెట్టాడు. ఆ తరువాత చలమయ్యనూ కరణం కొడుకునూ కూచోబెట్టాడు. అక్కడెక్కడో సీటు ఖాళీ అయితే- తణక్కూడూ వెళ్ళి బితుకూ బితుకూ మని కూచున్నాడు.

అరవై దాటిన మారయ్యకు జిహ్వాచాపల్యం ఎక్కువే. నీచు తగలకూడదని డాక్టర్లువిధించిన ఆంక్షను ఇట్లాంటప్పుడు సులభంగా మరిచిపోతుంటాడు.

తిరుగుడు వల్లా, హోటలు వాతావరణంలో గజిబిజి వల్లా బొత్తిగా ఆకలే తెలియలేదు శేఖరానికి. ఏదో ఎంగిలి పడి లేద్దామనుకుంటే పడనియ్యలేదుమారయ్య! "ఎగ్గుందా- మాటకుందా.... ఫిష్షుందా-" అనినోటికొచ్చినవన్నీ ఆర్డరిచ్చి, తను వేయించుకుని- శేఖరం విస్తరంతా ఎక్స్ట్రాలతో నింపేశాడు. "ఏం మొగమాట పడక- డబ్బు తీస్కున్నంత మాత్రాన- సంతకం పెట్టడవంటే మాటలా ?— కానీ..." అని ప్రోత్సాహపరిచాడు.

అల్లంత దూరాన కూచుని ఆరగిస్తున్న చలమయ్య కరణం కొడుకూ కూడా- ఏ మాత్రమూ మొగమాటపడటం లేదనీ గమనించాడు శేఖరం.

భోజనాలు తర్వాత అరటిపళ్ళూ, కిళ్ళీలూ, సిగిరెట్లూ కూడా సగౌరవంగా ఇప్పించాడు మల్లయ్య. అటుపైన మళ్ళీ రిజిస్ట్రార్ ఆఫీసుకి రిక్షాలు మాట్లాడాడు.

అయిదుగురూ ఆఫీసుదగ్గర రిక్షాలు దిగేసరికి అక్కడ ఏకాంబరం ఎదురు చూస్తూ క ని పిం చా డు. "వీరకోట బసెక్కినాను.... ఎవరో కనిపించి- ఈ దినం రిజిస్ట్రేషను వొద్దనుకున్నారు- అని చెప్పారు, ఎక్కినవాణ్ణి - బస్సు దిగేసినాను. కరణం పోలేదు- కరణం కొడుకు పోయినాడు- రిజిస్ట్రేషను వుంది- వొద్దనుకున్నారేం లేదు- అని తర్వాత

చెప్పినారు. అప్పుడింక బస్సు గూడా లేదు. ట్రంకురోడ్డు మీదికొచ్చి... లారీసట్టుకుని వొచ్చేశినాను" అన్నాడు మారయ్యతో.

ఏకాంబరాన్ని చూసి మారయ్య ముఖం సంతోషంతో వెలిగిపోయింది. "భోజనం చేశినావా ఇంతకూ?" అని అడిగాడు.

"మీరొచ్చిసారు. రిక్షాలెక్కి పోయినారని తెలిసింది... సరే హోటలుకే పోయుంటారనుకుని.. నేనూ అదుగో – ఆ పూట కూళ్ళింటిలో కానిచ్చేశినా–" అన్నాడు ఏకాంబరం.

"మాంవాం— నువ్వురాలేదని.... అయ్యా.... నామీద కోపం జేసుకున్నారు మాంవాం—" అన్నాడు మల్లయ్య ఏకాంబరంతో.

దానిగురించి కించిత్తు బాధపడుతున్నట్టుకూడా కనిపించలేదు మారయ్య. సముజ్జులైన చలమయ్య. "అం ఇంక తెమలకుంటే పన్నిట్చపోతుంది– వ్యవహారం కానియండి...." అన్నాడు.

"సరే మరి– మల్లయ్యా...." అంటూ మల్లయ్యను కాస్త అవతలకి పిలిచి జేబులోంచి కరణం రాసిన జాబు తీసి చదివి వినిపించాడు మారయ్య. సందేహం తీరకపోతే నువ్వే చదువుకో అన్నట్టుజాబు అతని చేతికిచ్చి అతను చదువుకోగానే.... మళ్ళీ తను తీసుకునేశావు– ఏమంటావు?అన్నట్టు అతనికేసి చూశాడు.

చూస్తుండగానే మల్లయ్య ముఖం అసహాయతతో వివర్ణమైపోయింది. అతని కనుబొమలు కించిత్తు కోపంతోనూ అసహనంతోనూ ముడిపడ్డాయి. అతను నేరుగా కరణం కొడుకుకేసి వచ్చి "ఏంది– ఇట్లు రాశినాడు మీ నాయన ?...." అని అడిగాడు.

"అదేమో.. డబ్బిస్తే తీసుకుని రిజిస్ట్రేషను చేసియ్యమన్నాడు.... అంతే ! నాకంకేమీ తెలీదు" అన్నాడు కరణం కొడుకు. అన్నాడేగాని, అతనికంతా తెలుసునని అతని వాలకం వల్ల స్పష్టంగా తెలుస్తూనే ఉంది.

"నీకు తెలీకపోయేటిదేమిటిది ?— పూళ్ళో మా చిల్లరంగిట్లో మీ బాకీ మొత్తం అరువందలుందిగదా ? దాని సంగతేమి ?— అని అడిగాడు మల్లయ్య. వాలకంలోనూ, గొంతులోనూ పొంగివస్తున్న ఉక్రోషాన్నీ ఆవేశాన్నీ దాచే ప్రయత్నం ఏమీ చెయ్యటం లేదతను.

మారయ్యతో బాబు చలయయ్యా ఏకాంబరమూ చూస్తూ నిలబడ్డారు.

"బాకీ వుందిగాని— ఎంతుందో ఏమో– లెక్క నాకు తెలీదు. నువ్వు డబ్బిస్తే– రిజిస్ట్రేషను చేసిమ్మని పంపించినాడు నాయన–అంతే" అన్నాడు కరణంకొడుకు.

చూస్తున్న పెద్దమనుష్య కేసి చూశాడు మల్లయ్య "అయ్యా... న్యాయమేమో మీరే చెప్పండి. కరణం మాకు ఆర్నూర్లు బాకీ. అది ఇయ్యకుండానే సంవత్సరందాటిపోతా వుంది. ఇప్పుడు వెయ్యిగావాలని పేచీ యేసినాడు. ఈ సంగతి నాకు నిన్న రాత్రి చెప్పొచ్చును గిదా .... నిన్న రాత్రి మాటగూడా చెప్పలేదు. నేను రిస్ట్రేషను కర్చులకు మాత్రం సొము తెచ్చుకున్నాను...." అని మారయ్యనే ఉద్దేశిస్తూ "అయ్యా.... ఇప్పుడంతా మీచేతుల్లో వుంది. సోమవారంనాడు బోరింగు వేసేదానికి అంతా రెడీచేసుకున్నాను. దానికీ అప్పుజేసినాను.... నాగోడు ఇంకెవురికి జెప్పుకోవాల?.... ఇప్పుడు రిస్ట్రేషను నిలిపెయ్యద్దండి...." అన్నాడు.

"బావుందయ్యా !.... మధ్యన నాకేనా వొచ్చింది ? పల్లెలో నాకూ సేద్యముంది ... రేపు సూర్పిళ్ళయినాక లోడు చెక్‌పోష్టు దాటాలంటే ముందుగా కరణం సర్టిఫికేటుండాల.... పేచీ మాటగూడా లేదు— నాకు తీరికలేదు– అంటాడిప్పుడు కరణం. నేనేం గావాల? కరణంతో మనస్తావం నాకెందుకు ? నీ బాకీ సంగతి నాకు జెప్తే ఏం లాభం ? మీకూ మీకూ ఎన్నుండాయో నాకేం దెలుసు ? నాకు కరణం జాబు రాసినాడు. దాని ప్రకారం డబ్బు ముట్టితే రిజిస్ట్రేషను చేయిస్తా. లేకుంటే అవతల నాకు వుట్టి మునిగే పనులుండాయి మావోడు లక్షపనులొదులుకుని వొచ్చినాడు. మేం వెంటనే బస్సెక్కేస్తాం.... ఆ పైన మీ ఇష్టం...." అన్నాడు మారయ్య.

లబోదిబోమన్నాడు మల్లయ్య ప్రాధేయపడ్డాడు. "అయ్య .... పెద్దలు.... మీరు గూడా ఇట్లనేస్తే నేనెవత్తో

చెప్పాకునేది ? వెయ్యి రూపాయిల సంగతి కరణం నాకు చెప్పనేలేదు. అసలు ఆయనకి సొమ్మియ్యాల్సుంటుందని నేను అనుకోనేలేదు."

"అనుకోకుంటే అదెవురి తప్పు ? పూజారికి దక్షిణ లేకుండా వ్రతం ఫలితం దక్కుంతుదనుకున్నావా ?.... మొగుడి పేరు పెళ్ళానికి తెలీదా ? పెళ్లాం పేరు మొగుడికి తెలీదా ? ఆ సంగతి పబ్లీకున చెప్పుకోవాల్నా ?.... తెలీకుంటే ఎట్ల ? ఇప్పుడు తెలుసుకుంటావు... అంతే !" అన్నాడు మారయ్య, లోకజ్ఞతను ఎగబోస్తూ.

ఆ తరువాత ఏకాంబరమూ చలమయ్యా జోక్యం కలగజేసుకున్నారు.

కరణం కొడుకునూ, మల్లయ్యనూ విడివిడిగా అవతలికి తీసుకెళ్ళారు. తగ్గు స్వరాల్లో వాళ్ళ మధ్య మాటలు నడుస్తున్నాయి.

ఈ తంతు ఎప్పటికి తెగుతుందో అంతు పట్టలేదు శేఖరానికి. ఇదివరకటి విసుగూ చిరాకూ- వీటి స్థానంలో అసహనమూ కోపమూ అధికమవుతున్నాయతనిలో.

మూడు గంటలు దాటుతోంది. చెట్లమీద కాకులు విసుగ్గా కదిలి 'కావు కావు' మంటున్నాయి. వ్యవహారం తెగేట్టు కనిపించలేదు. చర్చలతో విసుగెత్తి పోయినట్టు మల్లయ్య చరచరా మారయ్య దగ్గరికివచ్చి ఇలా అన్నాడు "ఇట్ల కరణం కొడుకు మొండిపట్టు పట్టితే నేనేం జేసేది ? నేను రీస్ట్రేషను కర్చులకు మాత్రం సొమ్ము తెచ్చుకున్నాను యెయ్యి యియ్యమంటే నా తరంగాదు...."

తనకూ సహనం లేనట్టు మండిపడే మొగం పెట్టాడు మారయ్య. "అవన్నీ నాతో జెప్పి ఏం లాభం ? కరణంతో నేనెందుకు పేచీ బెట్టుకోవాల ?— మీరూ ఎట్లన్నా సర్దుబాటు జేసుకోండి.... కరణం కొడుకుతో జెప్పు...."

"ఆయనకేం దెలీదంటాడు...."

"నాకూ యేందెలీదు ...." అన్నాడు మారయ్య మొండిగా.

"సరె.... అయితే ఇంక నేను జేసేదేముంది ? రీస్ట్రేషను మానుకోవాల— వకీలయ్య దగ్గరకు బోయి సొమ్ము వాపసు జేసుకోవాల...." అన్నాడు మల్లయ్య.

ఆ మాటతో భగ్గున మండిపడ్డాడు మారయ్య. "అట్నె జెయ్యి. అకాడికి మేఁవంతా సొదవలమై పోతేఁవి.... పన్లు మానుకుని నీ పనిమీద వొచ్చినాం గద.... బుద్ధిలేకుండా నన్నమాట ... ఆఁ ?"

మల్లయ్య కూడా రెచ్చిపోయాడు. "నష్టమెవ్వర్ది ? నాది గాదా ? కరణానికి యెయ్యి యియ్యాలని దెలసుంటే అసలు బూఁవికొనడఁహోలేదో నేనూముందుగానేకరారుజేసుకునేవోణ్ణి.... ఈ తిప్పటా కర్చూ నాకు మాత్రం యెఁదుకు? మీచేత మాటలు మాత్రం నేనెందుకు పడాల ?" అన్నాడు. అతని మాటల్లో అసహాయతా ఉక్రోషమూ దాగటం లేదు.

ఈలోగా చూస్తూ ఊరుకోలేకపోయాడు శేఖరం. చలమయ్యనూ ఏకాంబరాన్ని వారగా పిల్చి "అసలు సంగతేవిఁటి ? మల్లయ్యను ఏంచెయ్యమని ?" అని అడిగాడు.

కొంచెం దూరాన చెట్టుకింద నిర్లిప్తంగా నిలుచున్న కరణం కొడుకును ఊరికే అలాగ చూసి, కాస్త గొంతు తగ్గించి అన్నాడు ఏకాంబరం:

"అబ్బయ్యా ! ఆ కరణం దేవాంతకుడు. ఈ మల్లయ్యోళ్ళ దగ్గిర ఈకాడికే చానా వొడికేశినాడు .... వీళ్ళ చిల్లరంగిట్లో పెద్ద బొకనేవుంది. ఆరొందలంటాడు మల్లయ్య. లెక్కలో తప్పుండదులే— అంతా వుంటుంది. ఈ వంకన పేచీ యేసి ఇంతో అంతో లాగి ఆ బాకీ యిరగ్గోయించాలని కరణం ప్లాను. తనే వొస్తే పేచీ మెలిక బిర్రుగా వుండదని... వొళ్ళు బాగలేదని సాకు జెప్పి కొడుకును పంపించినాడు...." అంటూ ఇంకాస్త దగ్గిరగా వొచ్చి అన్నాడు.

"మల్లయ్య ఇచ్చేదన్నా కరణానికి జేరదు. ఈ కరణం కొడుకున్నాడే .... ఈడు అబ్బను మించిన బిడ్డ .... నాటు మొదులు విస్కీ నీటు దాకా అన్ని జలసా అలవాట్లే. ఈ వీరకోట సంగతి నీకు తెలుసో తెలీదో....వోపికా,వాయినం దెలవడఁవూ వుంటే గొప్ప శృంగార కోటలే.... కరణంకొడుకు ఇంక మ్రూడోజుల్దాకా మునిపల్లె మొహం సూడడు .......

యేడ్చి మొత్తుకుని మల్లయ్య జమజేసుకునే సొమ్మంతా యిక్కడ మెరకిదిలో కరిగిపోతుంది. అదీ సంగతి."

"హహ్హ...అంతేగద మల్ల—" అన్నాడు వింటున్న చలమయ్య. ఏకాంబరం చెబుతున్నదంతా అక్షరాలా సత్యం అని ధృవీకరిస్తున్నట్టు.

శేఖరం మనసంతా గొప్ప శూన్యంగా అయిపోయింది. ఆ శూన్యాన్ని అతని ముఖంలో చదివాడు కాబోలు మరింత చేరువుగా వస్తూ ఏకాంబరం ఇలా అన్నాడు:

"అబ్బయ్యా—ఈ సంగతులన్నీ నీకు కొత్త—విని తట్టుకోలేవు. అయితే యిదంతా మీ మాంవకుతెలీదనుకోబాం బాగా తెలుసు, యింకా మాకు తెలిసిందానికంటే యెక్కువగానే తెలుసు. తెలీ ట్టే చూడు. ఎంత పట్టనట్టుండాడో. ఆ కరణం అట్ల బీదోళ్ళను పీక్కుతింటాడు—వాడి పొట్ట నేనెందుకు కొట్టాల అంటాడు ఈన— రేపు వాడు నా పొట్ట కొట్టకూడదు — అంతే నాక్కావల్సింది అంటాడు. మీ మాంవని నాకేం మొగమాటంలేదులే. వెయ్యిసార్లు మారయ్య మొగాన్నే అంటాను. నాకేం భయం లేదు"

శూన్యంలో శూన్యంలా ఉన్న శేఖరంలో మెల్ల మెల్లగా ఒక ఆవేశం రేగసాగింది. అతి నిగ్రహంతో దాన్ని ఆలోచనగా మలుచుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాడు.

"అయితే-ఇప్పుడే చెయ్యాలి?" అన్నాడు.

"ఆఁ.... మనం చేసేదేముంది?" అని చప్పరించాడు చలమయ్య.

"వాళ్ళూవాళ్ళూ తేల్చుకోవాల....మీ మాంవ మాదిరే నువ్వూ తటస్థంగా ఉండాల...." అన్నాడు ఏకాంబరం.

ఆయన వేపు చురుగ్గా చూశాడు శేఖరం "నేనుండకపోతే?...." అన్నాడు.

ఆ మాట ఏకాంబరానికి అర్థంకాలేదు. "నీకేమైనా అర్థమైందా? అన్నట్టు చలమయ్య వేపు ప్రశ్నార్థకంగా చూసి మళ్ళీ శేఖరాన్నే అడిగాడు- "అదేందబ్బయ్యా?.... అట్లంటావు?!...."

"అవును-" అంటూ కదిలి మారయ్య దగ్గిరికెళ్ళాడు శేఖరం.

మల్లయ్యా మారయ్యా ఇంకా సంవాదించుకుంటూనే ఉన్నారు.

"మాంవయ్యా!...." అంటూ పిలిచి- మారయ్య ఇటు చూడగానే- 'ఇంతకీ భూమి ఎవరిపేర్తో ఉందీ? ..." అని అడిగాడు శేఖరం.

"నీ పేర్తో. అదేంది? అట్లడిగినావు?...."

"కొంటున్నది మల్లయ్య.... అమ్ముతున్నది నేను. నా ఇష్టం లేకుంటే మా నాన్నయినా అమ్మలేడనుకో.... అది వేరే కథ. సొమ్ము మా నాన్నకు అందింది. ఆ సంగతి నాకు తెలుసు. ఇక ఈ కాయితాల గొడవంతా నేనే జరిపిస్తాను...."

"అదేంది?...." అన్నాడు మారయ్య తెల్లబోతూ.

"అంటే....ఈ మల్లయ్యంటే నాకొక అభిమానం ఏర్పడింది! ఇంతకు ముందు ఇతణ్ణెరగను. ఇప్పుడే చూశాను. ఇతను ఇబ్బందుల్లో ఉన్నాడనికావచ్చు.... ఇంకా డబ్బివ్వలేడని కావచ్చు కారణం ఏదన్నా కానీ.... అసలిందులో కరణం మామూలు ప్రసక్తేలేదు! నాకు ఇష్టమయింది. మల్లయ్యకు నేను భూమి రాసిస్తాను. అతను ఏ రేటుకి స్టాంపు పేపర్లు కొంటాడో కొన్నీ....నేను సంతకాలు పెడతాను! ఏమంటావు? ఇందులో కరణంగానీ నువ్వుగానీ చెయ్యగలిగేది ఏముంది? " అన్నాడు శేఖరం. ఆలోచించి ఆలోచించి అంటున్నా, అతని గొంతులో ఆవేశం దాగటం లేదు.

"ఆఁ... మరి-" అని మాటలకోసం తడుముకున్నాడు మారయ్య- "ఏముంది? నేను జేసే దేముంది? కరణం జేసేదేముంది?.... ఊఁహుఁ.... ఏంలేదు....ఏంలేదే...." అని గొణిగాడు.

వింటూన్న చలమయ్యా, ఏకాంబరంకూడా ఒక్కసారిగా హాహాకారాలు చేశారు.

మల్లయ్య నలుగురివేపూ మార్చి మార్చి చూశాడు.

"మావోడు సరైన మాటన్నాడు. హహ్హ!-" అని నవ్వాడు ఏకాంబరం తెలిగిపోతూ. ఎగతాళిగా మారయ్యను చూస్తూ "ఏంపెద్దమనిషీ....అబ్బయ్యా అట్లజేస్తే...నువ్వేంజేస్తావు....కరణమేంజేస్తాడు?...." అన్నాడు.

"మరే!...." అన్నాడు చప్పరిస్తూ చలమయ్య, ప్రపంచంలో ఎవరుగానీ చేసేదేమీ లేదన్నట్లుగా.

వివర్ణమైన ముఖంలోకి మళ్ళీ రంగును తెచ్చుకుంటూ నవ్వాడు మారయ్య. కాని.... మనోడు-అట్ల చెయ్యడు గద?...." అన్నాడు ఎంతో భరోసాతో.

ఆ మాట విన్న శేఖరానికి ఆ క్షణం నూమయెద విపరీతమైన జాలికలిగింది. తను చెయ్యబోతున్న పనిని ఊహించలేని ఆయన అమాయకత్వానికి కొంచెం నవ్వు కూడా వచ్చింది.

"ఎందుకు చెయ్యనూ? ...తప్పకుండా చేస్తాను.. " అంటూ చప్పున మల్లయ్య చెయ్యిపుచ్చుకుని అతణ్ణి అవతలికి తీసుకెళ్ళాడు.

"అయ్యో - అదేంది? ...." అని వెనుక నుంచి మారయ్య అంటున్నా వినిపించుకోలేదు.

"ఏందన్నా? ఎక్కడికి?...."అంటున్నాడు మల్లయ్య అయోమయంగా.

"రా చెప్తాను...." అంటూ మల్లయ్యను మరో పదడుగులు అవతలికి తీసుకెళ్ళి- "స్టాంపు పేపర్లు కొన్నావా? అని అడిగాడు శేఖరం.

"కొన్నానన్నా!....కరణం కొడుకుతో మాటలు జరుగుతూ ఉండగా ఏకాంబరం పోయి యెస్టిమెంటు కనుక్కున్నాడు. మునిపల్లిలో మూడెకరాలకు ఇప్పుడు పద్దెనిమిది వేలుదాకా రేటుంది ...గవర్నమెంటు యెస్టిమెంటు ప్రకారం ఆ రేటుకి సరిపడే స్టాంపు కాయితాలు కొన్నాను. అంతా రెడీగుంది....కరణం కొడుకే వొప్పుకోసంటాడు...."

"వొకరొప్పుకునేదేముంది? భూమి నా పేరుతో వున్న పత్రాలేవీ?"

"ఇదుగోనన్నా-" అని కట్ట చూపించాడు మల్లయ్య. అతను గొప్ప తికమకలో ఉన్నాడు. శేఖరం అభిప్రాయమేమిటో మెల్లమెల్లగా అర్థమవుతూ ఉండగా అతని ముఖంలో కొత్త వెలుగు కదలసాగింది.

"అయితే ఇహ వొకరు చేసేదేముంది? కరణంకొడుకు రాసేదేముంది? సాక్షి సంతకాలకు మనుషులే దొరకరా? ముందు పత్రాల సంగతి చూద్దాంరా....వస్తూవస్తూ దార్లో జాబ్ టైపింగ్ బోర్డు చూశాను ...రా... ముందక్కడికి పోదాం...." అంటూ ముందుకు నడిచాడు శేఖరం.

"అన్నా !.... అదిగాదు.... ఇదేందన్నా ! ....అయ్యో నువ్వు మంచోడివని విన్నాంగాని....ఇంత పెద్ద మనుసను కోలేదు....గాని, వొద్దన్నా !—" అంటున్నాడు వెంటనడుస్తూ మల్లయ్య.

"శ్శ్! నా కడ్డు చెప్పకు - ఇప్పటికే విసుగెత్తిపోయింది .. "

"పల్లిటూళ్ళ గొడవలు నీకు తెలీవన్నా ! ...'

"ఇప్పుడే తెలుసుకుంటున్నాను....అందుకే ఇలా చేస్తున్నాను. నువ్వు మారుమాట్లాడకు...."

"కరణంతో ఏం బెట్టుకుంటామన్నా.. ."

"కరణమంటే నీకు భయమేమో....నాకేం భయం" రేపేదన్నా అన్నాడా—నేను పట్టుబట్టి ఇలా చేశానని చెప్పు."

"అదెట్లన్నా ..."

"ఇలాగే—నేను నిజంగానే చెపున్నాను— నాకు నచ్చినట్టే నేను రిజిస్ట్రేషన్ చేయిస్తాను. మా మావయ్య చెప్పినా మరొకరు చెప్పినా ఈ వెయ్యి రూపాయల దక్షిణకు వొప్పుకోను....అలా మీకు తరతరాలుగా అలవాటు చేశారు. మీరక్తంపీలుస్తుంటే ఆదీ "మామూలు"అనిమీరుసమర్పించుకుంటున్నారు. ఇందుకు మీరొప్పుకున్నా నేనొప్పుకోను. ఏదీ ఆ స్టాంపు కాయితాలు ఇలాగివ్వు."

టైపిస్టు కాస్త ఖాళీగానే ఉన్నాడు. రిజిస్ట్రేషను కాగితాలు టైపు చెయ్యటంలో కాస్త అనుభవజ్ఞుడే అతను. పావుగంటలో టైపు చెయ్యటం నీటుగా పూర్తయింది.

తెలుగులో ఉన్న పాతపత్రాలూ ఇంగ్లీషులో టైపు చేసిన కొత్త కాగితాలూ పోల్చిచూస్తూ చదువుకున్నాడు శేఖరం.

ఇదివరకు తనకు తెలియనిఅంశం ఒకటిగమనించాడు. తన పేరున ఉన్న భూమి మూడెకరాలని మామ చెప్పాడు. అది మూడెకరాల పన్నెండు సెంట్లని పత్రంలో ఉంది.

ఇంగ్లీషు తర్జుమా అంతాకూడా సరిగ్గా పద్ధతిగా వచ్చి

నందుకు సంతోషించాడు శేఖరం. టైపింగ్ ఛార్జి పదిహేను రూపాయలూ మల్లయ్య చేత ఇప్పించాడు.

టైపు చేసిన పత్రాలతోనూ మల్లయ్యతోనూ మళ్ళీ రిజిస్ట్రార్ ఆఫీసువేపు నడుస్తుండగా శేఖరానికి మనసు నిండుగా కించిత్తు గర్వంగా అనిపించింది.

పెద్ద మనుషులు కాకా హోటలు బెంచీల్లో కూచుని చర్చించు కుంటున్నారు.

శేఖరాన్ని చూస్తూనే ఏకాంబరం ఒక్క ఉదుటున ముందుకొచ్చాడు. "అబ్బయ్యా".... ఏంది? ఏంజేస్తా వుండావు నువ్వు?..." అని అడిగాడు. "ఏం మల్లయ్యా?" అన్నాడు మల్లయ్యను.

"అంతా-అన్న జేస్తావుండాడు... వొద్దంటే వినసం టాడు-" అన్నాడు మల్లయ్య తన నిర్దోషిత్వాన్ని వెల్లడి చేసుకుంటూ.

ఏకాంబరానికి ఏ సమాధానమూ చెప్పకుండా నేరుగా మారయ్యకేసి నడిచి ఇలాఅన్నాడు శేఖరం: "మాఁవయ్యా! మీ పేచీల్తో, మధవ్యర్తి తనంతో నాకుపనిలేదు. నా పేర్న ఉన్న భూమినినాకుఇష్టమనిపించినట్టు-అమ్మకం అమ్మకం లాగే-మల్లయ్యకురాసేశాను. ఇవిగోపత్రాలు.... మీ పెత్తనం నిల్పవాలంటే.... వొచ్చి సాక్షి సంతకాలు చెయ్యండి."

తెల్లబోయి-అసహాయంగా చూశాడుమారయ్య. కాస్త దూరంలో కూచున్న కరణం కొడుకు కుతకుతమని ఉడికి పోతున్నాడు. శేఖరం అన్నమాటవిని- మండిపడ్డట్టయి ఒక్కసారిగా లేచి చలమయ్యను కాస్త అవతలికి తీసు కెళ్ళాడు.

మారయ్య సమాధానం కోసం చూడకుండా మల్ల య్యతోబాటు గేటుదాటి ఆఫీసు ఆవరణలోకి ప్రవేశించాడు శేఖరం. "వాళ్ళతో పనెందుకు? నువ్వు వేరే సాక్షుల్ని చూడ లేవా?" అన్నాడు.

"ఎందుకు దొరకరు?...."

"అయితే చూడు-"

మల్లయ్య కదలబోయి, ఆలోగా పరుగులాంటి నడ కతో వొచ్చిన చలమయ్యను చూసి ఆగిపోయాడు.

"బాబు.... కొంప ముంచమాక....నువ్వొట్టి యెర్రి బాగులోడివి....ఇదంతా కచడా యెవారం.... చూస్చూ సెందుకు రొచ్చులో దిగుతావు?...." అన్నాడు చలమయ్య శేఖరంతో.

"ఏం?...."

"నీపేర్న వున్న భూఁవెంత...."

"మూడెకరాలు .... పన్నెండు సెంట్లు — ఏం?" ధీమాగా అన్నాడు శేఖరం.

"అవునా? అది నీ పత్రం ప్రకారం. గాని కరణం లెక్కలబట్టి దాన్లో పదారుసెంట్లు నీయికావు అది—యేటి పోరంబోకు"

అదిరిపడ్డాడు శేఖరం. అతని గొంతులో ఏదో మెలిక పడ్డట్టయింది. "అదెలాగ?...." అన్నాడు.

"అదంతే. నీకు విషయం తెలీదు. నాకూ యిప్పుడు కరణం కొడుకు చెప్పేదాకా తెలీదు. సీతారామయ్య దగ్గిర మీ నాయన కొన్నదిమూడెకరాల పన్నెండు శెంట్లు నిజఁవే. గాని దాన్లో పదారుశెంట్లు అమ్మడానికి సీతారామయ్యకే హక్కులేదు. దాన్ని నువ్విప్పుడు మల్లయ్యకెట్లమ్ముతావు?"

"సీతారామయ్య-ఎట్లవ్మాడు?—"అన్నాడు శేఖరం, మెల్ల మెల్లగా ఆలోచిస్తూ.

"అమ్మినాడు. అప్పుడు కరణం ఆ లెక్కసర్దినాడు. మీ నాయన నీ పేర్న కొనేశినాడు—యిప్పుడు...."

"ఆఁ—ఇప్పుడు?...."

"నువ్వు కర్నంతో యిరోధం పెట్టుకుంటున్నావా, రేపు ఆ పదారు శెంట్లూ హరిజనుల పేర్న పట్టా అవుతాయి. ఆళ్ళకూ మల్లయ్యకూ తగాదా అవుతుంది. కర్నం ప్రేరేపిస్తాడు. కేసవుతుంది. హక్కులేని భూఁమి అమ్మినం దుకు నువ్వూ కోర్టుకు పోవాల, పోతావా?...."

శేఖరం నెత్తినే పిడుగుపడ్డట్టయింది.

మాట్లాడుతున్న చలమయ్య ముఖమే వికృతమైపోతూ తనను వెక్కిరిస్తున్నట్లనిపించింది.

కనిపిస్తున్న ప్రపంచ దృశ్యమంతా తల్లకిందు లైంది.

చలమయ్య చెబుతున్నాడు శేఖరం వింటున్నాడు.

మారయ్యా ఏకాంబరమూ వొచ్చి పక్కన జేరారు. కొంచెం దూరంగా నిలుచున్నాడు కరణం కొడుకు.

చెట్ల కొమ్మల్లో వెల్తురు పేలవంగా మెరుస్తోంది.

మాటలు వినటం ఇక తన తరం కానట్లు మొహం తిప్పేశాడు శేఖరం. తలవంచేశాడు.

మరోసారి మల్లయ్యనూ కరణంకొడుకునూ విడివిడిగా అవతలికి తీసుకెళ్ళి మంతనాలు జరిపారు చలమయ్యా, ఏకాంబరం.

"చెప్తిగిగదా! నీ కిష్యన్నీ సరిగ్గా తెలీవు. . ఆఁ" అన్నాడు మారయ్య శేఖరం భుజంమీద చెయ్యేసి.

శేఖరం మాట్లాడలేదు.

ఉత్సాహంగా తిరిగొచ్చి అందర్నీ హుషారు చేశాడు ఏకాంబరం. సెటిలయిపోయిందయ్యా. మూణ్ణార్లు ముడు పిస్తావుండాడు మల్లయ్య. అంగడి బాకీ చెల్లు బెట్టుకుంటా డంట. యేటి పోరంబోకు గొడవ యెప్పుడూ యెత్తళ్ళే.... అబ్బయ్యా .... ఇదో మల్లయ్యా.... రా .... సంతకాలు గానిచ్చెయ్యండి..."

"అన్నగారూ... యేమనుకోవద్దుయిదంతామామూలే! ఆఁ...." అంటూ నవ్వుతూ కరణం కొడుకు చూపెట్టిన చోట్ల కాగితాలపై సంతకాలు చేశాడు శేఖరం.

తన చెయ్యి తనచెయ్యి కాదేమోనని అనుమానం వేసిందతనికిప్పుడు.

ఆ తర్వాత రిజిస్ట్రేషను వ్యవహారమంతా సజావుగా జరిగిపోయింది.

ఆఫీసు దగ్గర ఇవ్వవలసిన మామూళ్ళు ఇచ్చేశాడు మల్లయ్య.అక్కడే ఉండేపత్రాలు రాసే"రైటర్"కికూడాఫీజు ఇప్పించాడు కరణం కొడుకు. (అతను వాళ్ళ బంధువే!) పత్రాలు వేరే టైపు చేసుకున్నా మామూలు ఇవ్వాలి! లేకుంటే రిజిస్ట్రేషను తిన్నగా జరగకుండా అతను ఆపు జేయించగలడు. లేక, బాగా లేటు చేయించగలడు.

డబ్బు చేతిలో పడగానే నవ్వుతూ తుళ్ళుతూ కరణం కొడుకు పీరకోట వీధులంట వెళ్ళిపోయాడు.

వేరే పనులు చూసుకుని ఊరికెళ్తామని ఏకాంబరమూ చెలమయ్యా శెలవు తీసుకున్నారు.

కావలసిన మనిషొకడు తారసపడే సరికి "నేను నిదానంగా వొస్తాలే-నువ్వెళ్ళిపో-"అని ఆగిపోయాడు మారయ్య.

బస్టాండులో శేఖరానికి వీడ్కోలిస్తూమల్లయ్య కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు. "లోకమంతా అట్లుంటే నువ్వూ నేనూ ఏం చేస్తామన్నా?...." అన్నాడు. "నా వల్ల నీ మనసు నొచ్చిందేమో... మన్నించన్నా...." అన్నాడు.

బస్సు కదిలిపోతోంది. శేఖరం మనసులో ఏదో ఒగులు తోంది....!

* * *

# సంధ్యా సుందరి

## డా. చల్లా రాధాకృష్ణశర్మ

ఆకాశ సంకాశ లలాట భాగాన
అరుణ బింబమును తిలకంగా దిద్దుకుని
సితకాంతి చ్ఛటల చీర సింగారించి
మందమారుతపు రెవిక దాల్చి
మంద్రస్వరాన ప్రభాతగీతం పాడుతూ
చైతన్యమూర్తియై, లావణ్య లతికయై
అలరిస్తుంది ప్రాతస్సంధ్యా నర్తకి!

ప్రశాంతతా జలాశయంలో స్నానం చేసి
మనోజ్ఞతా చేలంతో ఒళ్ళు తుడుచుకుని
సంజకెంజాయ చీర కట్టుకుని
మల్లె పువ్వుల రెవిక ధరించి
పిల్ల గాలుల కురులు సవరించుకుంటూ
హాయి గొలిపే నవ్వు మొగంతో
ఆహ్వానిస్తుంది సాయం సంధ్యా సుందరి!